# ప్రజాస్వరం

PRAJASWARAM తెలుగు దినపత్రిక

# Bullet Edition

ఆదివారం 4 ఫిబ్రవరి 2026 www.prajaswaramdailly.com 4 PM


## సీఎంకు దోచుకోవడం.. దాచుకోవడం తప్ప ఏమీ తెలీదు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, ప్రజాస్వరం**

ముఖ్యమంత్రికి నీటిపారుదల రంగంపై కనీస అవగాహన లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. దోచుకోవడం, దాచుకోవడం తప్పా ఏమీ తెలియదన్నారు. సర్వ భ్రష్ట ప్రభుత్వానికి నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి అని విమర్శించారు. శాసన సభలో సీఎం మాట్లాడే భాష సరిగా లేదన్నారు. అజ్ఞానాన్ని కప్పిపుచ్చుకునేందుకే తిడుతున్నారన్నారు. వికృతమైన మాటలతో కేసీఆర్ స్థాయిని తగ్గించలేరన్నారు. తెలంగాణ కోసం రేవంత్ రెడ్డి ప్రాణాలు ఇస్తానంటున్నారు. ఇప్పటివరకు తీసిన ప్రాణాలు చాలు అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## మెదక్ సీఎస్ఐ చర్చిలో

# భక్తుల సందడి





**మెదక్ జనవరి 04 (ప్రజా స్వరం)**

ఆసియా ఖండంలోనే రెండవ అతి పెద్ద చర్చ్ గా ప్రసిద్ది గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చ్ మహాదేవాలయంలో ఆదివారం ఘనంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ బీటర్ ఇంచార్జీ శాంతయ్య ఆధ్వర్యంలో వాక్య సందేశం అందజేశారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో వచ్చిన క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన క్రైస్తవ భక్తులు, పర్యాటకులతో సందడిగా మారింది. ఈ తరుణంలో ముందుగా చర్చ్ ముందు భాగంగా లో గల సిలువ వద్ద కొబ్బరి కాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి తమ మొక్కలను చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్చ్ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## ఎలాంటి అపోహలు వద్దు

**సీఐ మూల రవీందర్ రెడ్డి**



**బొల్లారం,జనవరి 04(ప్రజా స్వరం)**

బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో మాదిరిగానే కేసుల నమోదు యథావిధిగా కొనసాగుతాయని బొల్లారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మూల రవీందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయమై ప్రజల్లో ఎలాంటి అపోహలు అవసరం లేదని ఆయన తెలిపారు.ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా బొల్లారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని, పోలీస్ శాఖ ప్రజల భద్రతకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని సీఐ పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో చట్ట పరిరక్షణ చర్యలు యథావిధిగా కొనసాగుతాయని ఆయన భరోసా ఇచ్చారు.ఈ నేపథ్యంలో ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి, అవసరమైన సందర్భాలలో నేరుగా బొల్లారం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సీఐ మూల రవీందర్ రెడ్డి కోరారు.

## ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశానికి రాజిరెడ్డి హాజరు



**మాసాయిపేట్ జనవరి 04 (ప్రజాస్వరం)**

గత ప్రభుత్వంలో ఏ పథకాలు వచ్చినా బిఆర్ఎస్ నాయకుల చేతివాటం ఉండేది అని నర్సాపూర్ కాంగ్రెస్ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఆదివారం నాడు మెదక్ జిల్లా మాసాయిపేటలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి ముఖ్య అతిథిగా రావడం జరిగింది మాసాయిపేట గ్రామంలో 49 మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో 25 వేల కోట్ల బడ్జెట్ ఏమైందని మాజీ మంత్రి హరీష్ రావును ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఏ ఒక్కరు కూడా రేషన్ కార్డులు మంజూరు చేసిన దాకా లేవని తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ కార్డును మంజూరు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి ఉప సర్పంచ్ వెంకటేష్,మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మాజీ సొసైటీ డైరెక్టర్ ఉదండపురం నర్సింలు వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు

## శాసనసభను సీఎం.. తప్పుదోవ పట్టించారు

**తెలంగాణకు నంబర్ -1 విలన్ కాంగ్రెస్**

**మాజీ మంత్రి హరీశ్ రావు**

**'నదీ జలాలు- కాంగ్రెస్ ద్రోహులు' పేరిట పవర్ పాయింట్ ప్రజెంటేషన్**



**హైదరాబాద్, ప్రజాస్వరం**

'నదీ జలాలు – కాంగ్రెస్ ద్రోహులు' పేరిట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ భవన్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణకు నంబర్ 1 విలన్ కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. ''తెలంగాణను గతంలో ఏపీలో కలిపి కాంగ్రెస్ పార్టీ మరణ శాసనం రాసిందన్నారు.. ఆ పార్టీ తెచ్చిన ఆయకట్టు కన్నా ఏడున్నర రెట్లు బీఆర్ ఎస్ సాధించిందన్నారు.. తాత్కాలిక సర్దుబాటు కిందే నీటి వాటాలకు కేసీఆర్ ఒప్పుకొన్నారు. శాసన సభను సీఎం రేవంత్ రెడ్డి తప్పుదోవ పట్టించారన్నారు.

## తెల్లాపూర్ డివిజన్‌లోనే వెలిమెల-విద్యుత్‌నగర్‌లు

**తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష... డిమాండ్**



పటాన్‌చెరు, జనవరి 04(ప్రజా స్వరం) పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని వెలిమెల, న్యూ ఎంఐజీ విద్యుత్‌నగర్ కాలనీలను తెల్లాపూర్ డివిజన్‌లోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ప్రజలు భారీగా ఆందోళనకు దిగారు. విద్యుత్‌నగర్‌లో నిర్వహించిన రిలే నిరాహార దీక్షకు తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి నాయకత్వం వహించారు.వెలిమెలను ముత్తంగి డివిజన్‌లోకి, న్యూ ఎంఐజీ విద్యుత్‌నగర్‌ను భారతి నగర్ డివిజన్‌లోకి విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. తెల్లాపూర్‌కు అత్యంత సమీపంలో ఉన్న ఈ కాలనీలను ఇతర డివిజన్లలో చేర్చడం వల్ల పరిపాలనా సమస్యలు తలెత్తడమే కాకుండా ప్రజలకు అనవసరమైన ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, పరిపాలనా సౌలభ్యం, ప్రజల అవసరాలు, భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వెలిమెల, విద్యుత్‌నగర్ ప్రాంతాలను తెల్లాపూర్ డివిజన్‌లోనే కొనసాగించాలి అని స్పష్టం చేశారు. అలాగే సర్కిల్ కార్యాలయాన్ని కూడా తెల్లాపూర్‌లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.ప్రజల అభిప్రాయాలను పక్కనపెట్టి ఏకపక్షంగా తీసుకున్న ఈ తికమక నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రిలే నిరాహార దీక్షను మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకూ వెనుకాడబోమని హెచ్చరించారు.ప్రజా సమస్యలను కాంగ్రెస్ పార్టీ పట్టించుకోకపోతే భవిష్యత్తులో ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు కోల్పోవడం ఖాయమని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, గ్రామ పెద్దలు, కాలనీ వాసులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు.

## 50 దేశాల్లో తెలుగు మాట్లాడేవారున్నారు

**ఆధ్యాత్మిక వారసత్వాన్ని నిర్వహించుకునేలా మహాసభలు**

**మారిషస్ అధ్యక్షుడు**

గుంటూరు, ఆంధ్ర : ప్రపంచవ్యాప్తంగా 50 దేశాల్లో తెలుగు మాట్లాడేవారు ఉన్నారంటే అతిశయోక్తి కాదని మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ తెలిపారు. మహాసభలు భాష, నాగరికతను మాత్రమే కాకుండా ఆధ్యాత్మిక వారసత్వాన్ని నిర్వహించుకునే విధంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత్, మారిషస్‌ల మధ్య సంబంధం ఉమ్మడి చరిత్ర, విలువలతో కలిగి ఉందన్నారు. తమ పూర్వీకులు భారత పుణ్యభూమి నుంచి వచ్చి భాషలను పరిరక్షించారన్నారు. సంప్రదాయాలను కాపాడి తరతరాల పాటు వాటిని కొనసాగించారన్నారు. 2025 మార్చిలో భారత ప్రధాని మోదీ మారిషస్‌ను సందర్శించడం, ఆ తర్వాత మా దేశ ప్రధాని భారత్‌ను సందర్శించడంతో మా భాగస్వామ్యం ఎంతో పురోగతి సాధించిందన్నారు.. అధికారక రాజనీతికి మించి ఇరుదేశాల మధ్య సంబంధాలను నిలబెట్టేది ప్రజల అనుబంధమేనన్నారు. భాష, వారసత్వం, సంస్కృతి ఇరుదేశాల సంబంధాలను కలుపుతున్నాయి'' అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ధరమ్ బీర్ గోకుల్‌కు ఆంధ్ర సారస్వత పరిషత్ భారతమిత్ర అవార్డు ప్రకటించింది. మారిషస్ అధ్యక్షుడికి ఉత్తరాఖండ్ ఆదిశంకరాచార్య పీఠం ఉత్తరాధికారి, గజల్ శ్రీనివాస్ అవార్డు అందించారు.

